నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

మేడ్చల్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పించడంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి, ఇతరత్రా సమస్యలపై తగిన సూచనల కోసం శుక్రవారం సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు మేడ్చల్ డిపోలో ‘డయల్ యువర్ డిపో మేనేజర్’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం సుధాకర్ ప్రకటించారు. సంప్రదించాల్సిన నంబరు 9959226152.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్సీఈ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మల్లారెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి మహేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ అశోక్, ఎన్ఎస్ఎస్ పీఓ రత్నకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: అర్హులైన వారు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్‌కు చెందిన వైష్ణవి దేవి, కిరణ్, శ్రీదేవి, ఎలోన్‌లకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు మేకల రాముయాదవ్, భైరు అనిల్ తదితరులున్నారు.

పవర్‌బోర్‌కు మరమ్మతులు !


మరమ్మత్తులు చేయిస్తున్న కాంగ్రెస్ నేతలు

గౌతంనగర్: డివిజన్ న్యూ మిర్జాలగూడ జాతీయ సేవా సంఘం కాలనీలో పవర్‌బోరును మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ మరమ్మతులు చేయించారు. డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, నాయకులు సత్యనారాయణ, నాగరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్ల ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలి



ఉప్పల్: సమగ్ర కుటుంబ సర్వే ఎన్యూమరేటర్లకు ఇన్సెంటివ్ వెంటనే చెల్లించాలని లేదంటే ప్రజా సంఘాల మద్దతుతో ఆందోళన చేస్తామని సీఐటీయూ నేత వెంకన్న అన్నారు. ఈ మేరకు సమగ్ర కుటుంబసర్వేలో పనిచేసిన అంగన్‌వాడీలతో కలిసి గురువారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఇన్సెంటివ్ గురించి అడిగితే అధికారులు ‘మాకూ రాలేదని’, సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై అధికారులు చొరవ తీసుకుని అంగన్‌వాడీలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇప్పించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి


సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గం, సీఆర్ఎంపీ రోడ్లు, జీహెచ్ఎంసీ రోడ్లు, అదనంగా మిలటరీ ఏరియాలో రోడ్డు వేయాలని కోరుతూ ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు అందజేశారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

గుంతలు.. చింతలు !

• అధ్వానంగా రహదారులు • ఇబ్బంది పడుతున్న వాహనదారులు

> నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.
> – కీసర


రాంపల్లి -కరీంగూడ రహదారి పక్కన ప్రమాదకరంగా మట్టికుప్పలు

ప్యాచ్‌వర్క్‌కు నోచుకోని రోడ్లు..
రాంపల్లి– భోగారం రహదారి, కరీంగూడ -ఘట్‌కేసర్, అహ్మద్‌గూడ -హరిదాస్‌పల్లి, కీసర - నూకలగూడెం, రహదారులతో పాటు ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో రహదారులు మరింత అధ్వానంగా తయారయ్యాయి. అంతర్గత కాలనీల రహదారుల పరిస్థితి చెప్పనక్కరలేదు.
◆ రాంపల్లి నుంచి వయా కరీంగూడ – భోగారం వెళ్లే రహదారి, రాంపల్లి వయా కరీంగూడ, ఘట్‌కేసర్ వెళ్లే రహదారుల్లో పలుచోట్ల 2 అడుగుల లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయి.

రహదారుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు..
ఇటీవల కాలంలో ప్రభుత్వం ఈ రహదారులను విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు టెండర్లు సైతం పిలవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ చెట్లను తొలగించాడు. కనీసం గుంతలను పూడ్చకపోగా, చెట్ల కొమ్మలను కుడా అక్కడే వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం..
ఈ రహదారుల గుండా రాత్రిపూట ప్రయాణిస్తే ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..
పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి విస్తరణ కంటే ముందే చెట్ల తొలగింపు వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..
రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు, చెత్త,చెదారాన్ని మొదటగా తొలగించేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.


నత్తనడకన రాంపల్లి, భోగారం రహదారి విస్తరణ పనులు

◆ కీసర నుంచి నూకలగూడెం వరకు గల ప్రధాన రహదారి కుడా అధ్వానంగా మారింది. ఈ రహదారికి ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టే విషయాన్ని సంబంధిత అధికారులు మరిచి పోయారని పలువురు విమర్శిస్తున్నారు.

మలుపులతో అవస్థలు..
అసలే వంకర తింకరగా ఉన్న రహదారిలో రాత్రిపూట రాకపోకలు సాగించే వాహనదారులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.

రెండు మున్సిపాలిటీల్లో దెబ్బతిన్న రోడ్లు..
నాగారం, దమ్మాయిగూడ , రెండు మున్సిపాలిటీల్లో పలు కాలనీల్లో అంతర్గత రహదారులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని కాలనీల్లో ఇప్పటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి.

విలీనమైన మారని పరిస్థితి..
గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో విలీనమైతే పెద్దఎత్తున అభివృద్ధి జరుగుతుందని భావించిన ప్రజలకు మున్సిపాలిటీల్లో తమ గ్రామాలు విలీనమైనా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందగా తయారైందని వాపోతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి..
ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆలస్యమవుతున్న రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచాలని, కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకుని రావాలని కోరుతున్నారు.

గుంతలను పూడ్చివేయాలి..
ఇక ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేసి వాహనదారుల ఇక్కట్లు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకులు !



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి తోట శంకర్

కీసర: సమాజ మనుగడలో ప్రధాన భూమిక పోషిస్తున్న వ్యవసాయ రంగాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని, సీపీఐ మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ అన్నారు. గురువారం కీసర మండల కేంద్రంలోని చీర్యాల గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన రైతుసంఘం మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి పాలకులు కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతుల సంక్షేమాన్ని విస్మరించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. 70 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి ప్రజలు జీవిస్తున్నప్పటికీ రైతులు వేసే ఉత్పత్తులతో మనిషి బతుకుతున్నప్పటికీ పాలకులు మాత్రం రైతుల వ్యవసాయంపై పట్టింపులేదన్నారు.

దళారుల పాలవుతున్న పంట..
ఆరుగాలం కష్టించి పండించిన పంటలను దళారులు సిండికేట్లుగా మారి దోచుకుంటున్నారన మండిపడ్డారు. మేడ్చల్‌జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరూప, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణయాదవ్, అనంతరం కీసర నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా శోభ, ప్రధాన కార్యదర్శిగా కొండ చిత్తారి, ఉపాధ్యక్షులుగా ఎన్.వెంకటేష్‌యాదవ్, కోశాధికారిగా భరత్, సహాయ కార్యదర్శిగా అనిల్, కృష్ణతో పాటు 9 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం రైతుసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీ ఈటలకు శుభాకాంక్షల వెల్లువ


ఎంపీ ఈటల రాజేందర్ జన్మదిన వేడుకల్లో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: మేడ్చల్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా గురువారం నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ఆయన నివాసానికి తరలివెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నేతలు కౌకుట్ల రాహుల్‌రెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, వామన్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జవహర్‌నగర్: మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, జవహర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు కమల్, నాయకులు మహేందర్‌యాదవ్, సంతోష్‌కుమార్ గుప్తా, అశోక్, శంకర్, రాజేశ్వర్, శేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ..
మేడ్చల్‌రూరల్/మేడ్చల్: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మేడ్చల్ మున్సిపాలిటీలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఎంపీ నివాసం వద్ద నిర్వహించిన వేడుకల్లో పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల బీజేపీ శ్రేణులు, నాయకులు పాల్గొని ఎంపీతో కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.
◆ మేడ్చల్‌కు చెందిన రాష్ట్ర నాయకులు విక్రమ్‌రెడ్డి, నందారెడ్డి, మండల పార్టీ అధక్షుడు శ్రీశైలంయాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీధర్, శైలజాహరినాథ్, నాయకులు మల్లికార్జున్‌ముదిరాజ్, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.


ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పండ్లు పంపిణీ...
మేడ్చల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో బీజేపీ శ్రేణులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజాహరినాథ్, నాయకులు ఆంజనేయులు, ప్రేమ్‌దాస్, అర్జున్, పుష్పలత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.
◆ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మునీరాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, మోహన్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్‌ముదిరాజ్‌లు విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

నిషేధిత పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

150 బస్తాల్లో 3,750 కిలోల నిషేధిత విత్తనాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత విత్తనాలు


వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

శామీర్‌పేట్: నిషేధిత పత్తి విత్తనాలను తరలిస్తున్న వ్యక్తిని మేడ్చల్ ఎస్వోటీ, శామీర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. కర్నాటక నుంచి మంచిర్యాలకు నిషేధిత విత్తనాలను తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో మేడ్చల్ ఎస్వోటీ, శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా శామీర్‌పేట ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో (టీఎస్19టీ3447) నంబరు గల డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నిషేధిత పత్తి విత్తనాలను గుర్తించారు. దీంతో ఓనర్ కం డ్రైవర్ నరేష్ (25), ను అదుపులోకి తీసుకుని విచారించగా.. మంచిర్యాల జిల్లాకు చెందిన సొల్లు సురేష్ ఆదేశాలతో ఈ విత్తనాలను తరలిస్తున్నట్లు చెప్పాడు. కర్నాటకకు చెందిన రమణ (సరఫరాదారు), మంచిర్యాలకు చెందిన సురేష్ (రిసీవర్)లు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం. 3,750 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు, సెల్‌ఫోన్, డీసీఎం వాహనాన్ని (మొత్తంగా రూ. 98.75 లక్షల విలువ) సీజ్ చేసి, డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు. మేడ్చల్ ఎస్వోటీ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, శామీర్‌పేట సీఐ శ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

కీసర ఆలయానికి నిధుల కేటాయింపుపై హర్షం

కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణ



కీసర: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ దేవాలయం కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో సుమారు రూ.50 కోట్ల మేర నిధులు కేటాయించడం సంతోషించదగ్గ విషయమని, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నగరానికి చేరువలో ఉన్న కీసరగుట్టకు ప్రతిరోజు పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. దేవాలయ అభివృద్ధితో పాటు, యాత్రికులు, భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించడంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కీసరగుట్ట ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

అల్వాల్: రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం కాగా.. భూసేకరణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. గురువారం అల్వాల్‌లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు నిర్వాసితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ మనోహర్, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాములు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిలు హాజరయ్యారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు మొత్తం 18 కిలోమీటర్ల పొడవునా ఎలివేటెడ్‌కారిడార్ నిర్మాణంతో పాటు జిల్లా పరిధిలో లోతుకుంట, అల్వాల్, హకీంపేట, పోతాయిపల్లి, తూంకుంట గ్రామాల్లో 12 కిలోమీటర్లు 200 ఫీట్ల వరకు రోడ్డు వైడెనింగ్ కోసం నిర్మాణాలను తొలగించాల్సి వస్తుందన్నారు.

బాధితులకు పరిహారం..
భూసేకరణ ద్వారా నిర్వాసితులైన 43 బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చడానికి ఆర్అండ్ఆర్ కింద తాజాగా 64 యూనిట్లను ఎంపిక చేశారు. భార్యభర్తలను కలిపి ఓ యూనిట్, మేజర్లుగా ఉన్న కుటుంబసభ్యులను ఒక యూనిట్ కింద తీసుకుంటామన్నా రు. ఒక్కొక్కరికి రూ.6.36 లక్షలను చెల్లిస్తామన్నారు.

33 ప్లాట్ల తొలగింపు..
అల్వాల్ సత్యా కాంప్లెక్స్‌లో దాదాపు 33 ప్లాట్లను రోడ్డు విస్తరణలో తొలగించాల్సి వస్తుందని, ఇందులో కేవలం ఆర్అండ్ఆర్ కింద 13 మంది పేర్లు ఉన్నాయన్నారు. మరో 20 మంది పేర్లు లేవని గ్రామసభలో బాధితులు తెలపడంతో సర్వే చేయించి మిగతా వారి పేర్లను నమోదు చేస్తామని హామీ ఇచ్చారు.



గురుకుల మహిళా కళాశాలలో జాతీయ సదస్సు


జ్ఞానపీఠ త్రయం వ్యాస సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహేంద్రహిల్స్ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో తెలుగు విభాగ అధ్యాపకురాలు డాక్టర్ లక్ష్మీఅసిరెడ్డి కన్వీనర్‌గా ‘జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహిత్య సమాలోచన’ అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ నందిని సిధారెడ్డి, గౌరవ అతిథి ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ కమలాకరశర్మ, విశిష్ట అతిథి మాట్లాడుతూ.. జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి నారాయణరెడ్డి, డాక్టర్ రావూరి భరద్వాజ సాహిత్యం అజరామరమైనదని, ఇలాంటి సాహిత్యాన్ని విద్యార్థులు చదవాలన్నారు. సదస్సు అనంతరం ‘జ్ఞానపీఠ త్రయం’ వ్యాస సంకలనాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ రఘు, డాక్టర్ శశిధర్, అనురాధ, కవిత, రమేష్, బాలమణి, రమాదేవి, శరత్‌చంద్ర, కుమారస్వామి, నరేందర్, స్వప్న భువాకర్, సిద్దుల జ్యోతి, అనిల్‌కుమార్, శరత్‌బాబు, సత్యనారాయణరెడ్డి, వింధ్యా పద్మావతి, దేవేంద్ర, తేజస్వి, మమత, పద్మమ్మ, జ్యోతి తమ పత్రాలను సమర్పించారు. మహేంద్రహిల్స్, బుద్వేల్ కళాశాలల ప్రిన్సిపాల్స్ స్నేహలత, శారద, తెలుగు అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై సమీక్ష


పారిశుధ్య పనులపై సమీక్షిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: పారిశుధ్య పనులపై కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ నాచారం వార్డు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాచారంలో కార్మికులు సరిగ్గా పనిచేయడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పనిచేయాలని వారిని వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్‌కు సూచించారు. రంజాన్ సందర్భంగా మజీద్, ఈద్గాలను శుభ్రం చేయాలని సూచించారు. కార్మికులకు అందాల్సిన సేఫ్టీ కిట్ల గురించి ఎమ్మెల్యేతో మట్లాడి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఏలు, జవానులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుషాయిగూడ: మీర్‌పేట, హెచ్‌బీకాలనీ డివిజన్ అధ్యక్షులు రామ్‌ప్రదీప్ ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన మహిళలకు ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా కుట్టుమిషన్లు అందజేశారు. నాయకులు బ్రహ్మచారి, వెంకన్నగౌడ్, నర్సింగ్, బాలరాజు, సాయిపవన్, మురళీచారి, చంద్రశేఖర్,మురళీ, క్రాంతి, ప్రవీణ్‌గౌడ్, యాదగిరి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసిన ఎస్ఎన్‌డీపీ అధికారులు

మౌలాలి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని ఎస్ఎన్‌డీపీ అధికారులు తన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ మెయిన్‌రోడ్ నుంచి డాక్టర్ కృష్ణనగర్ మీదుగా బండ చెరువులో కలిసే బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను రూ.1.75కోట్లతో చేపట్టనున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు. డీఈఈ సందీప్, ఏఈఈ వశిష్ట, జేఏసీ నేత వెంకన్న, అమీనుద్దీన్, బాగ్యానంద్‌రావు, నవాబ్, దినేష్ పాల్గొన్నారు.

బీజేపీలో రగిలిన అసమ్మతి !

పార్టీ పదవులకు రాజీనామా చేసిన సీనియర్ నేతలు


చిలుకానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నేతలు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ బీజేపీలో అసమ్మతి రగిలింది. తమకు సమాచారం లేకుండా సర్కిల్ పరిధిలో సీనియర్, అర్హులను పక్కన పెట్టి డివిజన్ అధ్యక్ష పదవులను ఏక పక్షంగా కట్టబెట్టడంపై సీనియర్ నేతలు భగ్గుమన్నారు. ఈ మేరకు గురువారం చిలుకానగర్ డివిజన్‌లో సమావేశం ఏర్పాటు చేసి తమ పార్టీ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. డివిజన్ అధ్యక్ష పదవులు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. పార్టీ నియమావళికి విరుద్ధంగా జరిగిన ఎన్నికను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పర్వేష్ సింగ్, శ్రీనివాసశర్మ, రామరాజు, పార్టీ సీనియర్ నేతలు తదితరులున్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఉచిత దంత పరీక్షలు


ప్రత్యేక అవసరాల చిన్నారులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అల్వాల్: నేరేడ్‌మెట్‌లోని డాక్టర్ వంశీస్ యూనివర్సల్ డెంటల్ ఆసుపత్రిలో గురువారం అనురాగ్ ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాలలో డౌన్ సింగ్రోమ్ ఉన్న పిల్లలకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ మాట్లాడుతూ.. డౌన్ సింగ్రోమ్ ఉన్న పిల్లలు వివిధ కారణాలతో అనేక దంత సమస్యలకు గురవుతారని, వాటిలో దంతాలు సాధారణం కంటే ఆలస్యంగా వచ్చినా దానివల్ల ఇతర సమస్యలు వస్తాయన్నారు. క్రమం తప్పకుండా దంతపరీక్షలు, శుభ్రపరచడం వల్ల దంత సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చన్నారు. అనంతరం పిల్లలకు టూత్ పేస్ట్, ప్రత్యేక టూత్ బ్రష్‌లు, మౌత్ వాష్ కలిగిన కిట్లను డాక్టర్ వంశీ అందజేశారు. అనురాగ్ ఫౌండర్ డాక్టర్ రామ్, మంజుల, కుమారస్వామి, మనోజ్, డాక్టర్ శివ, డాక్టర్ అనూష, డాక్టర్ ప్రతిభ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.